సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024

వైభవంగా రామలింగేశ్వరుడి కల్యాణం





కల్యాణంలో పాల్గొన్న భక్తజనం, ఇన్‌సెట్‌లో స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి కల్యాణం శనివారం తెల్లవారు జామున వైభవంగా సాగింది. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో చెర్వుగట్టు జనగట్టుగా మారింది. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. –నార్కట్‌పల్లి

న్యూస్‌రీల్

‘రావి’ సేవలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి



మోదీకి రాసిన లేఖను పోస్టు చేస్తున్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యుడు

భువనగిరి రూరల్‌ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, భారత పార్లమెంట్‌ భవనాన్ని ప్రారంభించిన రావి నారాయణరెడ్డి గౌరవార్థం ఆయన సేవలను పార్లమెంట్‌ వెబ్‌సైట్‌లో పొందపర్చాలని రావినారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖరాసి పోస్టు చేశారు. పార్లమెంట్‌ భవనాన్ని ప్రారంభించిన రావి నారాయణరెడ్డి ప్రారంభించారని, అయినా ఆయన పేరు పార్లమెంట్‌ వెబ్‌సైట్‌లో లేదని, వెంటనే పొందుపర్చాలని లేఖలో పేర్కొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, అనంతరం నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన జరిపించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి



శిక్షణ తరగతుల్లో అధికారులు, కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : చేనేత కార్మికులు కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ప్రజల అభిరుచులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని హైదరాబాద్‌లోని వీవర్‌ సర్వీస్‌ సెంటర్‌ ఏడీ ఎస్‌.వుగులేంథి పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లిలోని శ్రీరంజన్‌ సిల్క్‌ ఇండస్ట్రీలో ప్రధానమంత్రి సమర్థ్‌ యోజన పథకం కింద చేనేత కార్మికులకు రంగుల అద్దకంలో శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కాలానుగుణంగా డైజైన్లు రూపొందిస్తేనే మార్కెట్‌లో ఎక్కువ కాలం మనుగడ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్‌ సూపరింటెండెంట్‌ పవన్‌కుమార్‌, శ్రీరంజన్‌ సిల్క్‌ ఇండస్ట్రీ యజమాని ఎన్నం శివకుమార్‌, చేనేత కళాకారుడు భోగ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

29 వరకు స్వచ్ఛత పక్వాడ

నల్లగొండ : భారత ప్రభుత్వ ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ఆహార సంస్థ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ ఆదేశాల మేరకు భారత ఆహార సంస్థ నల్లగొండ డివిజన్‌ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ వరకు ప్రత్యేక స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ డివిజనల్‌ మేనేజర్‌ సుశీల్‌కుమార్‌సింగ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచే ఈ స్వచ్ఛత పక్వాడ ప్రారంభమైందని, ఉద్యోగులచే స్వచ్ఛత పక్వాడ ప్రతిజ్ఞ, సంస్థ కార్యాలయాలు డిపోల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛత పక్వాడ కోసం వివిధ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమాల్లో సంస్థ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రవాణా శాఖలో బదిలీలు

భువనగిరి క్రైం : జిల్లా ఇన్‌చార్జి రవాణా అధికారి గుంటి రవీందర్‌ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో మోటార్‌ వెహికిల్‌ ఇన్స్‌పెక్టర్‌ (ఎంవీఐ)గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌ శ్యామ్‌ప్రసాద్‌ జిల్లా ఇన్‌చార్జి రవాణా అధికారిగా రానున్నారు. అలాగే భువనగిరి అసిస్టెంట్‌ వెహికిల్‌ ఇన్స్‌పెక్టర్‌ (ఏఎంవీఐ) రఘుబాబును రామాయంపేటకు బదిలీ చేస్తూ శనివారం ఆ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

20న హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలు ఇతర కానుకలను ఈనెల 20న లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ రామకృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సత్యనారాయణస్వామి వ్రత మండపంలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఎంపీ ఎన్నికలకు రెడీ!

- పెడ్యూల్‌కు ముందే ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు
- ఈవీఎంల మొదటి దశ తనిఖీ, మాక్‌ పోలింగ్‌ పూర్తి
- ముగిసిన అధికారుల బదిలీలు
- పోలింగ్‌ సిబ్బంది జాబితా సిద్ధం
- పోలింగ్‌ కేంద్రాల్లో వసతుల కల్పనకు సన్నాహాలు



కలెక్టరేట్‌లో ఈవీఎంల ఫస్ట్‌ లెవల్‌ చెకప్‌ నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి, యాదాద్రి : త్వరలో జరగనున్న పార్లమెంట్‌ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఎన్నికల షెడ్యూల్‌ విడుదలకు ముందే ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇప్పటికే జిల్లా ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తి చేసి మాక్‌ పోలింగ్‌ కూడా నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, సెక్టోరియల్‌ అధికారుల జాబితా సైతం సిద్ధం చేశారు. వీరికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

జిల్లా పరిధిలో ఉన్న పోలింగ్‌ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 566 పోలింగ్‌ కేద్రాలు ఉన్నాయి. వీటితో పాటు కొత్తగా మరికొన్ని పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే తుది ఓటరు జాబితా ప్రకారం రెండు నియోజకవర్గాల్లో 4,53,817 మంది ఓటర్లు ఉన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు నిండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఓటు హక్కు కల్పించారు.

733 ఈవీఎంల తనిఖీ

డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలనే పార్లమెంట్‌ ఎన్నికలకు వినియోగిస్తున్నారు. వీటిని కలెక్టరేట్‌లోని గోదాముల్లో భద్రపరిచారు. ఈనెల 5నుంచి 12వ తేది వరకు 733 ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల మాక్‌ పోలింగ్‌ కూడా నిర్వహించారు.

పోలింగ్‌ సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

పోలింగ్‌ నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది జాబితాను సిద్ధం చేశారు. పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, సెక్టోరియల్‌ అధికారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ ప్రకటించగానే వీరికి ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వనున్నారు.

భారీగా అధికారుల బదిలీలు

పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో భారీగా అధికారుల బదిలీ జరిగింది. ఒకే చోట మూడేళ్లుగా పని చేస్తున్న అధికారులు, జిల్లాకు చెందిన అధికారులకు స్థాన చలనం కల్పించారు. జిల్లా పరిషత్‌ సీఈఓ, జిల్లా పరిషత్‌ డిప్యూటీ సీఈఓలు, సీపీఓ, డీసీఓ, డీఆర్‌డీఓ, ఎస్‌డీసీ, డీఆర్‌ఓలతో పాటు ఎక్సైజ్‌, సివిల్‌ పోలీసు శాఖల్లో అడిషనల్‌ డీసీపీ, ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐ స్థాయి అధికారుల వరకు స్థాన చలనం కల్పించారు. వీరితోపాటు 14మంది ఎంపీడీఓలు, మున్సిపల్‌ కమిషనర్లు, నలుగురు తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు, రవాణా శాఖలో డీటీఓ, ఎంవీఐ, ఏఎంవీఐలు బదిలీ అయిన వారిలో ఉన్నారు.

వేగంగా ఏర్పాట్లు



“పార్లమెంట్‌ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల ఫస్ట్‌ లెవల్‌ చెకింగ్‌ పూర్తి చేశాం. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమయంలో మాక్‌ పోలింగ్‌ కూడా నిర్వహించాం. ఎన్నికల షెడ్యూల్‌ రావడానికి ముందే ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

–భాస్కర్‌రావు, ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి

ప్రణాళికతో చదివితేనే లక్ష్య సాధన



ప్రేరణ తరగతుల్లో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వర్‌రావు

మోత్కూరు : విద్యార్థులు లక్ష్య సాధనకోసం ప్రణాళికాబద్ధంగా చదవాలని కలెక్టర్‌ హనుమంతు కే.జెండగే సూచించారు. మోత్కూరులోని వైజే గార్డెన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్య సాధనలో సమస్యలు ఎదురైనా అధిగమిస్తేనే సత్ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని, ఉన్నత స్థాయికి ఎదగాలంటే పాజిటివ్‌ ధోరణిలో ఆలోచనలు చేయాలని, అప్పుడు విజయవంతం అవుతామన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ ఇంటర్నెట్‌ ద్వారా మంచి, చెడు ఉంటుందని.. వాటిలో వాస్తవాలనే గ్రహించాలని సూచించారు. సమయాన్ని వృథా చేయవద్దని, పుస్తకాలు చదవాలని, క్రీడలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ వీరారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బలహీనతలను అధిగమించాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సాధించాలనే పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదన్నారు. విద్యార్థి దశలో సాధించాల్సిన లక్ష్యాలు, పరీక్షలకు సిద్ధం అయ్యే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ విద్యాధికారి జయపాల్‌రెడ్డి, ఎంఈఓ వేపూరి శ్రీధర్‌, హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌ రెడ్డి, సంక్షేమ హాస్టళ్ల అధికారులు, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల్లోని వసతి గృహాలు, కస్తూర్బా, మోడల్‌ స్కూల్‌, గురుకుల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతుల్లో పాల్గొన్న కలెక్టర్‌ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్‌ వీరారెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, తదితరులు

రాజీమార్గమే రాజమార్గం

- జాతీయ లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రధాన జడ్జి జయరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

భువనగిరి రూరల్‌ : కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్‌ మంచి వేదిక అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌, జిల్లా ప్రధాన జడ్జి జయరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా కోర్టులో విలేకరులతో మాట్లాడారు. మార్చి 9న జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్‌ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్‌ కేసులు, సివిల్‌, బ్యాంకింగ్‌, కుటుంబ వివాదాలు, ప్రీలిటిగేషన్‌, చెక్‌ బౌన్స్‌ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా ఉండేందుకు జాతీయ న్యాయసేవా సంస్థ లోక్‌ అదాలత్‌లను నిర్వహిస్తుందన్నారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో పేరుకుపోయిన కేసులకు సత్వర పరిష్కారం చూపేందుకు కృషి చేస్తుందన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేలా న్యాయవాదులు, పోలీసులు, పారాలీగల్‌ వలంటీర్లు, మీడియా ప్రతినిధులు కూడా కృషి చేయాలని కోరారు.

20 వేలకు పైగా కేసులు పెండింగ్‌

జూనియర్‌ సివిల్‌ జడ్జి మారుతిదేవి మాట్లాడుతూ జిల్లా కోర్టుల్లో సుమారు 20వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉండగా లోక్‌ అదాలత్‌లో రాజీ పడదగినవి11,833 కేసులను గుర్తించినట్లు తెలిపారు.అందులో క్రిమినల్‌ 4,115, సివిల్‌ 7,718 కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ఇవే కాకుండా అదనంగా ప్రీలిటిగేషన్‌ కేసులు 3,066, కేసులు నమోదై కోర్టుకు రానివి మరో 2,000 వరకు ఉన్నట్లు తెలిపారు. అలాగే పిట్టి కేసులు 18,015 ఉన్నాయన్నారు. కక్షిదారులు పరస్పర అంగీకారంతో కేసులను రాజీ చేసుకుంటే కోర్టులపై భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్‌ సివిల్‌ జడ్జి జి.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పని కల్పించాలి

ఆత్మకూరు(ఎం) : అర్హులందరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆత్మకూర్‌(ఎం) మండలంలోని కప్రాయపల్లిలో ఉపాధిహామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కూలీల సంఖ్య పెంచడంతో పాటు వంద రోజులు పనిదినాలు కలిపంచాలని సూచించారు. గ్రామ అవసరాలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల్లో 95 శాతం పన్నుల వసూలు కృషి చేసిన కార్యదర్శిని అభినందించారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ వీరారెడ్డి

చేతి వృత్తిదారులకు చేయూత

- పీఎం విశ్వకర్మ యోజన ద్వారా రుణాలు
- జిల్లాలో 4,788 దరఖాస్తులు

భువనగిరి టౌన్‌ : సంప్రదాయ చేతి వృత్తిదారులకు ఆర్థికంగా చేయూతనిస్తోంది కేంద్ర ప్రభుత్వం. ప్రధాని విశ్వకర్మ యోజన పథకం ద్వారా తక్కువ వడ్డీకి విడతల వారీగా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తోంది. ఈ పథకానికి జిల్లాలో శనివారం నాటికి 4,788 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 17 మండలాల్లో 3,402, మున్సిపాలిటీల నుంచి 1,386 దరఖాస్తులు అందాయి. వచ్చిన దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

ఐదు విడతల్లో రుణం

పీఎం విశ్వకర్మలో భాగంగా తొలి విడతలో 18 సంప్రదాయ చేతివృత్తులు, కళాకారులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఎంపికైన వారికి ఐదు విడతల్లో రుణాలు మంజూరు చేస్తారు. మొదటి సంవత్సరం రూ.లక్ష, రెండో ఏటా రూ.2 లక్షలు, ఇలా సంవత్సరానికి రూ.లక్ష పెంచుకుంటూ ఐదో సంవత్సరం రూ.5 లక్షల రుణం ఇవ్వనున్నారు. దీనిపై కేవలం 5 శాతం మాత్రమే వడ్డీ వసూలు చేయనున్నారు.

18 రకాల వృత్తులు ఇవీ..

వడ్రంగి, స్వర్ణకార, కమ్మరి, కుమ్మరి, శిల్పులు, రాళ్లుకొట్టేవారు, చెప్పులు కుట్టేవారు, మేసన్‌, బట్టలు కుట్టడం, తాపీ పని, చాప అల్లడం, చేపలు పట్టడం, తాళ్ల అల్లిక, క్షౌ వరాలు, పూలదండలు అల్లేవారు, ఇస్త్రీ చేసేవారు, చేపల వలలు తయారు చేసేవారు, సుత్తి, తదితర పనిముట్టుదారులకు ఈ పకథం వర్తిస్తుంది. వారికి వృత్తి పరమైన శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

అవగాహన సదస్సులు

18 రకాల సంప్రదాయ చేతివృత్తుల వారికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై పరిశ్రమల శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా సదస్సులు నిర్వహిస్తున్నారు.

ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ప్రభుత్వ విప్‌ బీర్ల ఐలయ్య



హెల్త్‌ సబ్‌ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్‌ బీర్ల ఐలయ్య

మోటకొండూరు : ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ప్రభుత్వ విప్‌ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆలేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని, ప్రభుత్వ పెద్దల సహకారంతో నీళ్లు, నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కొత్తగా ఏర్పడిన మోటకొండూరు మండలంలో ప్రభుత్వ శాఖలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు తెస్తానని, రోడ్లు, రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు.అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ కట్టబెట్టిన మోటకొండూర్‌ మండల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అంతకుముందు చాడ గ్రామంలో ఉప వైద్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మోటకొండూర్‌లో ఆయనకు పార్టీ కార్యకర్తలు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అన్నంపట్ల సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు ఝిల్లలం సంజీవరెడ్డి, నాయకులు బీర్ల శంకర్‌, పచ్చిమట్ల మదార్‌గౌడ్‌, నెమ్మాణి సుబ్రహ్మణ్యం, గంగాపురం మల్లేష్‌, కొంతం మోహన్‌రెడ్డి, భాస్కరుణి రఘునాథరాజు, వంగపల్లి మహేందర్‌, భూమండ్ల అశోక్‌, వంగాల మల్లేష్‌గౌడ్‌, బోయిని ఝాన్సీ, అనంతుల నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్‌ ఫైనాన్స్‌ కోర్సులను రెగ్యులర్‌ చేయాలి

నల్లగొండ రూరల్‌ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కొనసాగుతున్న సెల్ఫ్‌ ఫైనాన్స్‌ కోర్సులను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మెయిన్‌ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖమ్మంపాటి శంకర్‌ మాట్లాడుతూ సెల్ఫ్‌ ఫైనాన్స్‌ కోర్సుల వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందని.. ప్రభుత్వం రెగ్యులర్‌ చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ వర్తిస్తుందన్నారు. ఎంజీయూలోని హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా వసతులు లేవని.. యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్‌, మల్లేష్‌, సురేష్‌, నవీన్‌, రాజు, మధు, శ్రీకాంత్‌, స్వాతి, అనురాధ, నక్షత్ర, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారానికి భరోసా

- ఆత్మ నిర్భర్‌ భారత్‌ స్వనిధి పథకం ద్వారా రుణాలు
- ఆరు మున్సిపాలిటీల్లో 9,119 మంది గుర్తింపు
- ఇప్పటి వరకు 405 మందికి మంజూరు
- మార్చి నెలాఖరులోగా పూర్తి



భువనగిరిలో వీధి వ్యాపారులు

భువనగిరి: కోవిడ్‌ కారణంగా నాలుగేళ్ల క్రితం అన్ని వర్గాల ప్రజల జీవన పరిస్థితులు తలకిందులయ్యాయి. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో వీధి వ్యాపారం నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులను ఆదుకొని భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్‌ భారత్‌ స్వనిధి పథకం కింద మెప్మా ఆధ్వర్యంలో రుణాలు అందిస్తోంది. ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణాలు అందించారు. దీంట్లో భాగంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో గుర్తించిన వీధి వ్యాపారులకు మూడు విడత రుణాలు అందిస్తున్నారు.

వ్యాపారులకు గుర్తింపు కార్డులు

జిల్లా వ్యాప్తంగా 9,116 మంది వీధి వ్యాపారులు ఉండగా ఇందులో భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో 3,426, చౌటుప్పల్‌లో 1,721, ఆలేరులో 1,039, యాదగిరిగుట్టలో 1,123, పోచంపల్లిలో 936, మోత్కూర్‌లో 874 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు మెప్మా అధికారులు గుర్తించారు. వీరికి మెప్మా ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను సైతం అందజేశారు.

మూడో విడత..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో మొదటి, రెండో విడతల్లో రుణాలు తీసుకొని సక్రమంగా చెల్లించిన వారికి మూడో విడుత రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండో విడత సంపూర్ణంగా రుణాలు చెల్లించిన వారిని గుర్తించారు. ప్రస్తుతం మూడో విడత కింద ఒక్కో వీధి వ్యాపారికి రూ.50 వేల చొప్పున జిల్లాలో ఇప్పటి వరకు 405 వీధి వ్యాపారులకు రూ.2.02 కోట్లు రుణాలు ఇచ్చారు.

మూడో విడతలో ఇప్పటి వరకు ఇచ్చిన రుణాలు (రూ.లక్షల్లో)

మున్సిపాలిటీ	వీధి వ్యాపారులు	మంజూరైన రుణం
భువనగిరి	112	56
చౌటుప్పల్‌	69	34.50
ఆలేరు	62	31
యాదగిరిగుట్ట	39	19.50
పోచంపల్లి	61	30.50
మోత్కూర్‌	62	31

అర్హులందరికీ రుణాలు అందిస్తాం



“జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో అర్హులైన వారందరికీ ఆత్మనిర్భర్‌ పథకం కింద రుణాలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లాలో రెండో విడతల్లో రుణాలు ఇచ్చాం. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన వ్యాపారులకు మూడో విడత రుణాన్ని అందిస్తున్నాం. ఆత్మనిర్భర్‌ పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి.

– రమేష్‌బాబు, మెప్మా జిల్లా అధికారి

సకాలంలో చెల్లిస్తే రెట్టింపు రుణం

జిల్లాలో 2020 మార్చి నుంచి ప్రతి వీధి వ్యాపారికి రూ.10వేలు అందించేలా ఆత్మ నిర్భర్‌ పథకాన్ని అమలు చేస్తున్నారు. తీసుకున్న రుణాన్ని ఏడాదిలోపు ఏడు శాతం వడ్డీతో బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోపు సక్రమంగా చెల్లించిన వ్యాపారులకు రెట్టింపు రుణం రూ. 20వేలు అందించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొదటి విడతలో 7,016 మందికి రూ.7.01 కోట్లు అందించగా రెండో విడత కింద 3,653 మందికి రూ.7.30కోట్ల రుణాలు అందించారు. రెండో విడత కింద తీసుకున్న రుణం చెల్లించిన వారికి ప్రస్తుతం మూడో విడత కింద ఒక్కొక్కరికీ రూ.50వేలు అందిస్తున్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం



నందిని

నిడమనూరు : యువతి అదృశ్యమైంది. నిడమనూరు మండలం శీతల తండాకు చెందిన ఇస్లావత్ హరి, అంజి దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. చిన్న కుమార్తె, కుమారుడిని హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. వీరి పెద్దకుమార్తె ఇస్లావత్ నందిని (21) ఇంటి వద్ద మిషన్ కుట్టుకుంటూ ఉంటోంది. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి నందిని కనిపించలేదు. పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుడు హరి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

రాయగిరిలో సైకో వీరంగం



గాయపడిన లక్ష్మమ్మతో కుటుంబ సభ్యులు

భువనగిరి క్రైం : భువనగిరి మున్సిపాలిటీలోని రాయగిరిలో శనివారం సైకో వీరంగం సృష్టించాడు. తన ఇంటి వద్ద కూర్చుని ఉన్న బీనబోయిన లక్ష్మమ్మపై కర్రతో దాడి చేయగా తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సైకోను తాడుతో నిర్బంధించి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు. సైకో పలువురి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసినట్లు స్థానికులు తెలిపారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పెద్దవూర : మండలంలోని తుంగతుర్తి గ్రామంలోని శ్రీపార్వతీ సమేత స్వయంభూ సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శిర్సనగండ్ల నర్సింహారావు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు జి.కర్తయ్య ప్రారంభించి మాట్లాడారు. మారుమూల గ్రామంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో మ్యాట్‌పై కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిర్సనగండ్ల ప్రదీప్‌కుమార్, దుగ్యాల శంకర్, పల్లెబోయిన సత్యనారాయణ, మల్లయ్య, సాంభయ్య, మెండె ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నుంచి ఇసుక అక్రమ రవాణా

- కోదాడ, హైదరాబాద్‌కు తరలిస్తున్న వ్యాపారులు
- చెక్ పోస్టును తప్పించుకునేందుకు గ్రామాల మీదగా వస్తున్న టిప్పర్‌లు



ఏపీ నుంచి తెలంగాణలోకి వస్తూ శనివారం పట్టుబడిన ఇసుక టిప్పర్

కోదాడ రూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అర్ధరాత్రి వేళల్లో జోరుగా ఇసుక రవాణా సాగుతోంది. ఇసుక టిప్పర్‌లు, లారీలు ఏపీ నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల మీదగా కోదాడ, హైదరాబాద్‌కు చేరుకుంటున్నాయి. ఏపీలోని ఇసుక వ్యాపారులతో కోదాడకు చెందిన కొందరు వ్యాపారులు చేతులు కలిపి ఈ దందాను కొనసాగిస్తున్నారు. రాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు ఈ దందాను కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి వేళలో 15 నుంచి 20 వరకు టిప్పర్‌లు వస్తున్నాయి. ఒక్కో టిప్పర్‌లో 30 నుంచి 45 టన్నుల వరకు ఇసుకను తరలిస్తు టన్నుకు రూ.1100 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారులు సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ కాస్తు అటుగా వెళ్లిన అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పనులకు సరఫరా చేస్తున్నామని చెబుతూ నకిలీ బిల్లులు సృష్టించి ఇసుక రవాణా చేస్తున్నారు.

సరిహద్దు గ్రామాల మీదగా...

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల ప్రాంతాల మీదగా పారుగుతున్న మున్నేరు వాగుతో పాటు కృష్ణానది పరీవాహక ప్రాంతాల ఇసుక రీచ్‌ల నుంచి ఈ ఇసుక వ్యాపారం సాగుతోంది. జగ్గయ్యపేట మండలంలో వేదాద్రి, రావిరాల, మర్కాపురం, ముక్త్యాల, వత్సవాయి మండలంలోని కన్నెవీడు, పోలంపల్లి, చిట్యాల, నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు, చెవిటికల్లు కొడవటికల్లు తదితర రీచ్‌ల నుంచి ఈ ఇసుకను తరలిస్తున్నారు. అక్కడి ప్రభుత్వం డీడీలు తీస్తే ఇసుక రీచ్‌లలో తక్కువ ధరకు విక్రయిస్తుంది. అయితే, అక్కడి ప్రధాన వాగుల్లో ప్రస్తుతం నీటి ప్రవాహం లేకపోవడంతో కొందరు వ్యాపారులు ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌ల నుంచి కాకుండా వేరే చోట్ల నుంచి రాత్రి సమయాల్లో జేసీబీలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి టిప్పర్‌లు, లారీల ద్వారా తెలంగాణలోకి రవాణా చేస్తున్నారు. ఈ వాహనాలు తెలంగాణలోని కోదాడకు రావాలంటే విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు రాష్ట్రాల సరిహదుల్లో ఉన్న అటు చిల్లకల్లు ఇటు సరిహద్దు చెక్ పోస్టుతో పాటు చిమిర్యాల శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టులను దాటి రావాల్సి ఉంది. ఈ మార్గంలో వస్తే చెక్‌పోస్ట్ సిబ్బంది పట్టుకుంటారనే భయంతో ఆ వాహనాలను ఏపీలోని జగ్గయ్యపేట మీదగా దొండపాడు, అన్నారం, రెడ్లకుంట, కాపుగల్లు, గుడిబండ గ్రామాల మీదగా కొన్ని వాహనాలు వెళ్తుండగా.. మరికొన్ని కూచిపూడి, తొగర్రాయి సబ్‌స్టేషన్‌ల మీదగా కోదాడకు తరలిస్తున్నారు. ఇలా వచ్చిన ఇసుకను తెల్లవారు జామునే గుట్టుచప్పుడు కాకుండా వే్‌బ్రిడ్జి కాంటాపెట్టి కొందరు లోకల్‌లో విక్రయిస్తుండగా మరి కొందరు నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం..



"ఏపీ నుంచి తెలంగాణలోకి అక్రమంగా ఇసుక వస్తున్నట్లు సమాచారం అందింది. మూడు రోజుల నుంచి తనిఖీలు చేస్తున్నాం. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.

– రజితారెడ్డి , సీఐ, కోదాడ రూరల్

ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్ట్

సంస్థాన్ నారాయణపురం: ఫోర్జరీ కేసులో శనివారం పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాఘవేంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఏపూరి శివయ్యకు ఇంటి స్థలం విషయంలో ఇతర కుటుంబ సభ్యులతో వివాదం ఉంది. ఆ స్థలాన్ని తన పేరిట మార్చుకునేందుకు శివయ్య రెండు మాసాల క్రితం గ్రామ కార్యదర్శి నరేష్‌కు అర్జీ పెట్టుకున్నాడు. శివయ్య అర్జీని కార్యదర్శి తిరస్కరించారు. దీంతో శివయ్య స్థలం విషయంలో అప్పటి ఉప సర్పంచ్ ఉప్పరగోని సంజీవను ఆశ్రయించాడు. సంజీవ డబ్బులు తీసుకుని గ్రామ పంచాయతీ నుంచి ట్యాక్స్ చెల్లించినట్లుగా బిల్లులు, నకిలీ స్థల ధ్రువీకరణపత్రంపై స్టాంప్ వేసి కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇచ్చాడు. వాటిని తీసుకుని రిజిస్ట్రేషన్ కోసం చౌటుప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలని వెళ్లగా సిబ్బంది నకిలీవిగా గుర్తించి పంచాయతీ కార్యదర్శి నరేష్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శివయ్యతో పాటు మాజీ ఉప సర్పంచ్ సంజీవను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచారు. తప్పుడు పత్రాలతో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

పంచాయతీ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్



పాలకవీడు పంచాయతీ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్‌తో వ్యాపించిన మంటలు

పాలకవీడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాలకవీడు గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు స్థానిక విద్యుత్ లైన్‌మన్‌కు సమాచారం అందించారు. వెంటనే లైన్‌మన్ మోషయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పి వేశారు. కార్యాలయంలోని బోర్ మోటార్ స్టార్టర్ బాక్స్ కండెన్సర్లు పేలడంతోనే ప్రమాదం జరిగిందని లైన్‌మన్ గుర్తించారు. ఆలస్యమైతే గదిలోని గ్యాస్‌సిలిండర్లకు, ఇతర సామగ్రికి మంటలు అంటుకుంటే ప్రమద తీవ్రత ఎక్కువగా ఉండేదన్నారు. కార్యాలయంలో ఏలాంటి ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

అడ్డగూడూరు : పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. అడ్డగూడూరు మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి కప్పల యాదయ్య, నర్సమ్మ (45) దంపతులకు అప్పులు అధికం కావడంతో మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నర్సమ్మ శనివారరం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరింది. మార్గమధ్యలో అడ్డగూడూరు మండల కేంద్రం శివారులో విగతజీవురాలిగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగరాజు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతురాలు ధర్మారం గ్రామానికి చెందిన నర్సమ్మగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నర్సమ్మ మృతదేహంపై ఉన్న కవర్‌లో హైదరాబాద్ నుంచి అడ్డగూడూరుకు వచ్చిన బస్ టికెట్‌ను గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్ : రెండు రాష్ట్రాల సరిహద్దు వాడపల్లి చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. శనివారం వాడపల్లి బోర్డర్ చెక్‌పోస్టు, యాదాద్రి పవర్ ప్లాంట్‌తో పాటు వాడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద జరుగుతున్న పనులు చూసి అక్కడి భద్రతను పరిశీలించారు. అనంతరం చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం వాడపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో ఉన్న కేసుల వివరాలను ఆరా తీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి అక్కడి పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వీరబాబు తో పాటు వాడపల్లి ఎస్ఐ ఇతర సిబ్బంది ఉన్నారు.

ఏఎమ్మార్పీకి నీటి నిలిపివేత

గుర్రంపోడు : ఏఎమ్మార్పీకి నీటి విడుదలను అధికారులు శనివారం నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం పానగల్లులోని ఉదయ సముద్రం నింపేందుకు 15 రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. నెల రోజుల పాటు నీటిని విడుదల చేసి పానగల్ చెరువులో ఒక టీఎంసీ నిల్వ చేయాలని అధికారులు భావించినా.. ప్రస్తుతం రైతులు తరుచూ తూముల గేట్లు ఎత్తుతుండడం సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో నీటిని నిలిపివేశారు. పంటలకు నీరు అవసరం లేని ఏప్రిల్ నెలాఖరు నుంచి నీటిని విడుదల చేయాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలి

- నల్లగొండ కలెక్టర్ హరిచందన



ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన అధికారులను ఆదేశించారు. తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లిలో ఉన్న గోదాములో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆరు స్ట్రాంగ్ రూములను ఈ కేంద్రంలోనే ఏర్పాటు చేస్తున్నమాని తెలపగా.. మరో స్ట్రాంగ్ రూమును కూడా ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ చందనా దీప్తి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ నాయక్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ డీఈ నాగయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారం ప్రాజెక్ట్‌కు నీరు విడుదల చేయాలి

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరేందుకు నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీ నదిలోకి నీటి విడుదల చేయాలని ప్రాజెక్టు ఆయకట్టు రైతు నాయకుడు చామల వెంకటరమణారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. మూసీ నదిపై వలిగొండ మండలం నెమలికాల్వ వద్ద ఉన్న ఆనకట్టను రైతులు, నీరుపారుదలశాఖ ఏఈ రాములుతో కలిసి శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నెమలికల్వ ఆనకట్ట నుంచి ఆసిఫ్‌నహర్ కాలువకు మూసీ నది వరద నీటిని మళ్లించడంతో మూసీ నదిలోకి వరదనీరు రాకుండా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. దీంతో పల్లివాడ దగ్గర ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు హెడ్‌రెగ్యులేటర్ నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితిని ఫోన్‌లో ఆయన నల్లగొండ జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ సుందర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన నల్లగొండ నీటిపారుదలశాఖ ఈఈ సుందర్ నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీనదిలోకి నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌దే



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

మర్రిగూడ: తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్ల కోసమే సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఉపయోగం లేదనే ప్రజలు కాంగ్రెస్ పట్టం కట్టారని అన్నారు. కానీ కాంగ్రెస్ తక్కువ సీట్లతో అధికారంలోకి వచ్చినా అభివృద్ధి మాత్రం ఉండబోదన్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర వ్యాప్త విజయ సంకల్ప యాత్రను రాజస్తాన్ సీఎం భజన్ లాల్ శర్మ ప్రారంభిస్తున్నారని అన్నారు. ఈ యాత్రలో భాగంగా కోటి మందికి పైగా నాయకులు ప్రజలను నేరుగా కలిసే అవకాశం ఉందన్నారు. 22న మునుగోడు నియోజకవర్గంలో యాత్ర ఉంటుందని, ఈ యాత్రను జయప్రదం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ పాపారావు, గుండగోని భరత్‌గౌడ్, యాస అమరేందర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, రూపం లింగస్వామి, గ్యార గోపాల్, రాజేందర్, జిల్లా కిశోర్, పంగ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

లెక్కలు రావడం లేదని..

- విద్యార్థిని చితకబాదిన హెచ్‌ఎం



గాయపడిన విద్యార్థి ప్రేమ్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్ : లెక్కలు సరిగా రావడం లేదని ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినిని చితకబాదాడు. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బూరుగడ్డకు చెందిన మెరిగ వీరబాబు, స్వాతి దంపతుల కుమారుడు ప్రేమ్‌కుమార్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. ప్రేమ్‌కుమార్‌కు తీసివేత లెక్కలు సక్రమంగా రావడం లేదని పాఠశాల క్లాస్ టీచర్, ప్రధానోపాధ్యాయుడు కాంతయ్య విద్యార్థి వీపుపై ఇష్టారీతిన కర్రతో కొట్టాడు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన ప్రేమ్‌కుమార్ నొప్పి భరించలేక అప్పుడే కూలి పని నుంచి వచ్చిన తల్లికి విషయం చెప్పాడు. గతంలో కూడా ఇదే హెచ్‌ఎం అకారణంగా ఓ విద్యార్థిని గాయాలయ్యేలా కొట్టాడని గ్రామస్తులు తెలిపారు. హెచ్‌ఎం కాంతయ్యకు ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా జరిగిన ఘటనపై ఎంఈఓ సైదానాయక్‌ను సంప్రదించగా సోమవారం పాఠశాలను సందర్శించి విచారణ జరుపుతానని, నిర్ధారణ అయితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయరాజు

భువనగిరి క్రైం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు సూచించారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏఐఐఎంఎస్ బీబీనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో క్యాన్సర్ వ్యాధి గుర్తింపు నివారణ చర్యలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి వేగవంతమైన జీవన విధానంలో ఆరోగ్యంపై శ్రద్ధ తక్కువైందన్నారు. దీంతో వ్యాధుల బారిన పడి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి కె.మారుతీదేవి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధికి గురై చాలామంది బాధపడుతున్నారని, వ్యాధిని ముందుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ఏఐఐఎంఎస్ వైద్యులు డాక్టర్ వాహిణి, జిల్లా వైద్యుడు డాక్టర్ ఎడ్ల అనీల్‌రెడ్డిల ఆధ్వర్యంలో చికిత్స అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కోర్టు ఆవరణలో నిర్వహించిన శిబిరంలో న్యాయవాదులు, సిబ్బంది రక్తదానం చేశారు.

'ఆవిష్కర్త' విజయవంతం కావాలి

- ప్రముఖ సినీ దర్శకుడు నీలకంఠ



సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు నీలకంఠ

భూదాన్‌పోచంపల్లి: ఆవని క్రియేషన్స్ బ్యానర్‌పై పోచంపల్లికి చెందిన యువదర్శకుడు భోగ ప్రవీణ్‌కుమార్ నిర్మించిన 'ఆవిష్కర్త' సినిమా విజయవంతం కావాలని ప్రముఖ సినీ దర్శకుడు నీలకంఠ అన్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో సినిమా పేరును ఆవిష్కర్తగా ప్రకటించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిత్ర యూనిట్‌ను అభినందించారు. అనంతరం దర్శకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబ కథాంశంపై చిత్రాన్ని నిర్మించామని, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, త్వరలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాత్విక ప్రవీణ్, నిర్మాత రుద్ర నవీన్, కెమెరామెన్ ఉపేంద్ర సూరెపల్లి, సంగీత దర్శకుడు విజయ్ కరాకుల, మేకప్‌మెన్ చందు, వీఎఫ్ఎక్స్ శ్రీరామ్, నటీనటులు కార్తీక్, ప్రణీత, శ్రీనివాస్, శ్రీహరి, నందు, శివ, రామ్, సాయి, రామకృష్ణ, భానుప్రకాశ్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేత నాగిరెడ్డి

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీస్వయంభు వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రముఖ విద్యావేత్త, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పందిరి నాగిరెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.15,016లు, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా వరుసగా రూ.12,016, రూ.10,016, రూ.8,016ల నగదును అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలె సామియేలు, గడ్డం చంద్రారెడ్డి, గ్రామపెద్దలు రెణబోతు వీరారెడ్డి, రాంబాబు, శ్రీను, బోనాల శ్రీధర్, అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, ఉపేందర్ గౌడ్, బ్రహ్మాచారి, వీరబాబు, నవీన్, హరీష్, వెంకటేశ్వర్లు, కొండ గోపయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరింది.. పదవులు ఆశించి కాదు

- చలమల్ల కృష్ణారెడ్డి



చలమల్ల కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అనుచరులు, అభిమానులు

చౌటుప్పల్ : తాను పదవులు ఆశించి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా తొలిసారి శనివారం ఆయన చౌటుప్పల్ మండల పరిధిలోని దామెర గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్య అనుచరులు, అభిమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి పనిచేస్తానని, ఆయన సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని అన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి సహకారంతో పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా పనిచేస్తానని చెప్పారు. రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిత్వం తనకు తెలుసునని, మనసులో పెట్టుకునే వ్యక్తికాదన్నారు. కొంతమంది వ్యక్తులు తప్పుగా చెప్పినా ఆయన అవేమీ పట్టించుకోరని అన్నారు. రథసప్తమి ఉన్నందునే శుక్రవారం రోజున పార్టీలో చేరానని కృష్ణారెడ్డి వెల్లడించారు.

కుల గణన తీర్మానం ఆమోదం పొందడం హర్షణీయం

నల్లగొండటౌన్: రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందడం హర్షణీయమని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుల గణన తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు పాసోజు విశ్వనాథం, కోశాధికారి నల్ల సోమలన్న, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు కాశయ్యగౌడ్, పసుపులేటి సీతారాములు, నిమ్మనబోటి కృష్ణయ్య, యువజన సంఘం అధ్యక్షుడు చొల్లేటి రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



పెద్దవూర : పెద్దగూడెంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



పెద్దగూడెంలో పూజలు నిర్వహిస్తున్న పాండురంగారెడ్డి

పెద్దవూర : మండలంలోని పెద్దగూడెం గ్రామంలో కొలువై ఉన్న ఆదిశంకర పార్వతీ సమేత జడల రామలింగేశ్వర స్వామి, తుంగతూర్తి గ్రామంలో కొలువై ఉన్న శ్రీపార్వతి స్వయంభూ సోమేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని శనివారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రతీఏటా రథ సప్తమి రోజున స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఈ కల్యాణ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తుల తరలివస్తారు. పెద్దగూడెంలో నిర్వహించిన స్వామి కల్యాణంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉడుతూరి శ్యాంసుందర్‌రెడ్డి–గీత దంపతులు, మాజీ సర్పంచ్ కూన్‌రెడ్డి మల్లారెడ్డి, కోటిరెడ్డి, దయాల లక్ష్మీపవన్, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, పోశం కోటిరెడ్డి, గుర్రం శంకర్‌నాగలక్ష్మి, రాంరెడ్డి తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మృతుడు గుర్రంపోడు వాసి

చిల్పూరు(జనగామ): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన శనివారం ఉదయం జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని చిన్నపెండ్యాల ఆర్చ్ వద్ద జరిగింది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథన ప్రకారం.. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొన్నాయిగూడేనికి చెందిన గోగుల కల్యాణ్ (35) బైక్‌పై జమ్మికుంటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నపెండ్యాల ఆర్చ్ సమీపంలో తాటికాయల నుంచి వేగంగా వస్తున్న డీసీఎం రాంగ్ రూట్‌లో ఘన్‌పూర్ వైపునకు తిరిగింది. దీంతో బైక్.. డీసీఎంను ఢీకొనడంతో కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో పెట్రోలింగ్ వాహనంలో వెళ్తున్న కానిస్టేబుల్ మేకల యాదగిరి.. 108కు సమాచారం అందించి ఎంజీఎంకు తరలించాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే కల్యాణ్ మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ హరీశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


చిక్క రాకేశ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : ప్రేమించిన యువతి మోసగించిందని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెదాడు. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పద్మనగర్‌కు చెందని చిక్క రాకేశ్ (22) ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న ఓ యువతిని కొంతకాలంగా ప్రేమించుకొన్నారు. అయితే, ఆ యువతి ఇటీవల ఇంటి సమీపంలో ఉన్న మరో యువకుడితో చనువుగా ఉంటూ రాకేశ్‌ను దూరం పెట్టింది. దాంతో ఈ నెల 14న రాకేశ్‌కు ప్రేమించిన యువతితో పాటు చనువుగా ఉంటున్న యువకుడి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆ యువతి రాకేశ్‌ను ప్రేమించడంలేదంటూ చెప్పేసింది. మనస్తాపం చెందిన అతను రాత్రి ఇంటికి వచ్చి గదిలో పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన రాకేశ్‌ను కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల అనంతరం శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి మరణ వాంగ్మూలం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. యువకుడు మృతి

బీబీనగర్: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. బీబీనగర్ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీగనర్ మండలం చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన అంబెపు రాజు(30) శుక్రవారం పని నిమిత్తం మండల కేంద్రానికి బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తున్నాడు. బ్రహ్మణపల్లి పరిధిలోని వైకుంఠదామం వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీ, రాజు బైక్ రెండు ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. స్కూటీ ఢీకొట్టడంతోనే రాజు మృతి చెందాడని అతడి బావ భూపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ మృత్యుఒడికి


లక్ష్మమ్మ (ఫైల్)

నల్లగొండ క్రైం: దైవ దర్శనం చేసుకుని తిరిగి వెళ్తున్న ఓ మహిళను మార్గమధ్యలో టిప్పర్ రూపంలో మృత్యువు కబళించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ మండలం బొమ్మేపల్లికి చెందిన దాసరి లక్ష్మమ్మ (28) భర్త కోటేష్, కుమారుడు శివకుమార్‌తో కలిసి శనివారం చెర్వుగట్టుకు వెళ్లారు. శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరుడి కల్యాణం అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నల్లగొండలోని డీఈఓ కార్యాలయం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ వీరి బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న లక్ష్మమ్మ ఒక వైపు, భర్త, కుమారుడు మరో వైపు పడిపోయారు. అనంతరం టిప్పర్ లక్ష్మమ్మ మీది నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. భర్త, కుమారుడు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ నల్లగొండ మండలంలోని పారేపల్లిగూడేనికి చెందినదిగా గుర్తించారు. మృతురాలి సోదరుడు జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన సీఐ సత్యనారాయణ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గరిడేపల్లి : అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారానికి చెందిన పర్వతాలు కొంతకాలంగా పీడీఎస్ బియ్యం దందా సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన చిలకరాజు సైదులును తన వాహనానికి డ్రైవర్‌గా పెట్టుకుని బియ్యాన్ని సేకరిస్తున్నాడు. గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పీడీఎస్ బియ్యంతో వెళ్తున్న అశోకా లీలాండ్ వాహనం పట్టుబడింది. డ్రైవర్ సైదులును అదుపులోకి తీసుకుని విచారించగా యజమాని ఆదేశం మేరకు సర్వారం గ్రామానికి చెందిన గుగులోతు రాము వద్ద బియ్యాన్ని సేకరించుకుని వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

అంగరంగ వైభవంగా..

రమణీయం.. రామలింగేశ్వరుడి కల్యాణం

- మాఘశుద్ధ గడియల్లో ఒక్కటైన స్వామి, అమ్మవారు
- ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వీరేశం దంపతులు
- కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- చెర్వుగట్టుపై మార్మోగిన శివనామస్మరణ
- ప్రత్యేక ఆకర్షణగా శివసత్తుల నృత్యాలు
- స్వామి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు


శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా భక్తులతో నిండిపోయిన గట్టు


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై వెలిసిన శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శనివారం తెల్లవారుజామున మాఘశుద్ధ గడియాల్లో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారికి ప్రభుత్వం తరఫున నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులను ప్రధాన మండపం నుంచి వృషభ వాహనంపై ఆలయ పుర వీధుల గుండా ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదాక్షర సరస్వతీ బిరుదాంకితులు అల్ల పురం సుబ్రహ్మణ్యదీక్షితవధాని, నీలకంఠశివాచార్య, ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేష్ శర్మ, సతీష్‌శర్మ అర్చక బృదం వేద మంత్రోచ్ఛరణలతో స్వామిఅమ్మవారి కల్యాణ తంతు గావించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని కనులారా తిలకించారు. విశాంత్రి ప్రాంతాల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లకు వడి బియ్యం, తలబ్రాలు సమర్పించారు. గట్టు పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగింది. కల్యాణానికి శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేల సంఖ్యలో వచ్చిన శివసత్తులు స్వామి అమ్మవారులకు ప్రత్యేకంగా అలంకరించిన బుట్టలలో వడి బియ్యం, వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. కల్యాణంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సుమారు 500మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కల్యాణ ఘట్టం ఇలా..

శనివారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రధాన ఆలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. 4.45 గంటలకు మహామండపం నుంచి అనంతరం తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాతో స్వామి, అమ్మ వార్లను కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. 5.25 గంటలకు ఎమ్మెల్యే దంపతులు స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. 5.50గంటలకు జీలకర బెల్లం కార్యక్రమం అనంతరం 6.15 గంటలకు మాంగళ్యధారణ గావించారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపాల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, వారాల రమేష్, గడుసు శశిధర్‌రెడ్డి, పున్నపురాజ యాదగిరి, రేగట్టి నర్సింహారెడ్డి, రేగట్టి నవీన్‌రెడ్డి, మాల్గ శంకర్, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు పాల్గొన్నారు.

చెరువుగట్టు హుండీ ఆదాయం రూ.9,90,520

నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ అధికారులు శనివారం సాయంత్రం లెక్కించారు. స్వామివారికి రూ.9,90,520 ఆదా యం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. గతంలో రూ.6.18లక్షలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్‌లు ఇంద్రసేనారెడ్డి, వి.శంకర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


స్వామివారికి పూజలు నిర్వహించి హారతి తీసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే దంపతులు

మూడు నెలల్లో 60వేల ఎకరాలకు సాగునీరు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి

ఉదయం సముద్రం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. వచ్చే మూడు నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకువచ్చి మొదటి విడతలో 60 ఎకరాలకు విడుదల చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం నీళ్ల లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ఎస్ఎల్‌బీసీ, డిండి తదితర పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెర్వుగట్టుపై రెండో ఘాట్ నిర్మాణ పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవడమే తమ ప్రభుత్వ అభిమతమని పేర్కొన్నారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం దంపతులు


మోకాళ్లపై గుట్టపైకి వస్తున్న భక్తురాలు


ఒడి బియ్యంతో వస్తున్న యువతి



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, కోనేరులో శిగం ఊగుతున్న భక్తురాలు


జడల రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే


బతుకమ్మ ఆడుతున్న శివసత్తులు


వేకకు హాజరైన భక్తురాలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


కోనేరులో స్వామివారికి మొక్కుతున్న భక్తురాలు

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం : గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మకంటి గోపి కొంతకాలంగా ఒడిశా ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేట పట్టణానికి తీసుకొస్తున్నాడు. ఆ గంజాయిని ఆత్మకూర్(ఎస్) కందగట్ల గ్రామానికి చెందిన దుండిగ ప్రసాద్తో పాటు, సూర్యాపేటకు చెందిన తులసి సాయికిరణ్‌కు విక్రయిస్తున్నాడు. దీంతో వీరిద్దరు కొంత వారు తాగుటకు ఉంచుకొని మిగిలిన గంజాయిని సూర్యాపేట పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం, ఖమ్మం రోడ్డు ప్రాంతం, కాలేజీ వవిద్యార్థులకు విక్రయిస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం బొమ్మకంటి గోపి తన వద్ద ఉన్న గంజాయిని తీసుకొని సూర్యాపేట పట్టణంలోని రాజీవ్ పార్క్ వద్దకు వచ్చి దుండిగ ప్రసాద్, తులసి సాయికిరణ్‌లకు ఇస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లను, సెల్‌ఫోన్‌లు, 250గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గకార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు బాలకృష్ణ, లోకేష్, సిబ్బంది ఆనంద్, వెంకటేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూకి రూ.5 లక్షల విరాళం అందజేత

నల్లగొండ రూరల్: హైదరాబాద్‌కు చెందిన ఫార్మస్యూటికల్ సంస్థ లేబరేటరీస్ మహాత్మాగాంధీ యూనివర్సిటీకి రూ.5లక్షలు విరాళమిచ్చినట్లు ఆ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విరాళంతో రసాయన శాస్త్రంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి బంగారు పతకాలు అందిస్తామని వీసీ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడరూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని గోపిరెడ్డినగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపిరెడ్డినగర్‌కు చెందిన చిత్తలూరి ప్రసాద్ ఈ నెల 16న ఇంటికి తాళం వేసి స్వగ్రామం వెళ్లారు. శనివారం వచ్చి చూడగా ఇంటి ముందుకు కిటికీలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 5తులాల బంగారు అభరణాలతో పాటు కొంత నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక మృతిపై డీఎంహెచ్ఓ విచారణ

- ఆపరేషన్‌కు మత్తు వైద్యుడు రాలేదని నిర్ధారణ


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కొండల్‌రావు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడలో మందు ఇంజక్షన్ వికటించి తొమ్మిదేళ్ల బాలిక మృతి ఘటనపై శనివారం డీఎంహెచ్ఓ కొండల్‌రావు విచారణ జరిపారు. మిర్యాలగూడ పట్టణం రెడ్డీ కాలనీలో గల సాయి ఆర్థోకేర్ ఆస్పత్రిని తనిఖీ చేసి బాలికకు అందించిన వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాలి ఆపరేషన్‌కు మందు ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ స్వయంగా బాలికకు మత్తుమందు ఇచ్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. మత్తు వైద్యుడి పర్యవేక్షణలో ఆపరేషన్‌కు ముందు మత్తమందు ఇవ్వ వలసి ఉండగా, ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదన్నారు. బాలిక వయస్సుకు తగినంతగా ఇవ్వకుండా మత్తు మోతాదుకు మించి ఇవ్వడంతో కోమాలోకి వెళ్లి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యుడు శ్రీనివాస రాజు వాంగ్మూలాన్ని సేకరించామని తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాల ఆధారంగా నివేదిక రూపొందించి కలెక్టర్‌కు పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ కేశా రవి, సీహెచ్ఓలు వెంకయ్య, శ్రీనివాసస్వామి తదితరులున్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండు

నల్లగొండ: కామర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు మార్కెట్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎంజీయూ ప్రిన్సిపాల్ ఆకుల రవి అన్నారు. ఆయన శనివారం నల్లగొండ చర్లపల్లిలోని సాంఘిక రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జరిగిన నేషనల్ కామర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి కామర్స్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. వాటికి సంబంధించిన నైపుణ్యాలను నేర్చుకుని పట్టు సాధిస్తే ఉద్యోగాలు సాధించడం సులువు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ.డా.అప్పారావు, మీనయ్య, చలపతి, ప్రశాంత,అలివేలు, కస్తూరి, కె.శ్రీదేవి, జె.సురేష్‌రెడ్డి, ఏవీఎస్.మూర్తి, ఎ.ప్యాట్రిక్, ఉషాకిరణ్, శ్రీలక్ష్మీ, అంజిరెడ్డి, గోనారెడ్డి, నరిస్రెడ్డి, షేక్ సుల్తానా, అపర్ణ, కె.సీతాలక్ష్మి, జె.ఎస్.నిరూప, ఆరుణకుమారి పాల్గొన్నారు.

చదువులో రాణిస్తేనే పేదరికం దూరం



మాట్లాడుతున్న నైనాజైస్వాల్

- టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్

హుజూర్‌నగర్ : చదువు అనేది చీకటిని పారద్రోలే వెలుతురు లాంటిదని ప్రపంచ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్, ఐఆర్ఎస్ అధికారి సందీప్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన వార్షిక అవార్డుల పంపిణీ, వ్యక్తిత్వవికాస కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని, చదువులో రాణించడం ద్వారానే పేదరికం దూరమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు గురువులనే కాకుండా మహిళలను కూడా గౌరవించడం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దానిని వెలికి తీసేందుకు ప్రయత్నించాలని వారు తెలిపారు. సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం ద్వారా విద్యార్థుల ప్రతిభ మరుగున పడుతుందని, అవసరం మేరకే సెల్‌ఫోన్ వినియోగించడం మంచిదని వారు అన్నారు. అనంతరం విద్యార్థులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మర్రెడ్డి, డైరెక్టర్ సరిత, కరస్పాండెంట్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): కారు అదుపుతప్పి కిరాణదుకాణానికి దూసుకెళ్లడంతో యజయానికి గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన శృంగవరపు శ్రీనివాస్ రెడ్డి తన అత్తగారి ఊరైన ఆత్మకూర్(ఎస్) మండలం నసీంపేటకు కారులో భార్య,పిల్లలతో వస్తున్నాడు. అతివేగంగా వచ్చిన కారు రోడ్డు వెంట ఉన్న మూల ఎల్లయ్య కిరాణం షాపులోకి తీసుకెళ్లింది. ఆ సమయంలో ఎల్లయ్య షాప్ కౌంటర్‌లో కూర్చొని ఉన్నాడు. షాపు ముందు పిల్లర్ ను ఢీకొట్టి కారు ఆగిపోయింది. గాయపపడిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు.శ్రీనివాస్‌రెడ్డి భార్య శైలజకు స్వల్ప గాయాలయ్యాయి.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్



చింతలపాలెం : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణ రాష్ట్ర 33వ సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ టోర్నమెంట్ డే అండ్ నైట్ పోటీలు చింతలపాలెంలో కొనసాగుతున్నాయి. ఈ పోటీలలో బాలురు, బాలికల జట్లు 68 పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.వెల్లయ్య, క్రిస్టఫర్, యాదయ్య, గురుమూర్తి, నర్సింగరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామచంద్రగౌడ్, ఎస్.నరసింహారావు, ఆర్.భూలోకరావు, కన్వీనర్ నాగిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.